
సాక్షి
మెదక్
బుధవారం । 5 । మార్చి । 2025

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య



మెదక్‌జోన్: జిల్లాలో ఎలాంటి బర్డ్‌ఫ్లూ వ్యాధిలేదని, దీని గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య తెలిపారు. ఇటీవల కొల్చారం మండలం నాయిని జలాలపురంలో, టేక్మాల్ మండలం ఏల్లుపేట్‌లో మూడు రోజుల నుంచి దాణా, నీళ్లు అందించక పోవడంతో కోళ్లలో రోగ నిరోధక శక్తి తగ్గిందని, దీంతో అవి మృతి చెందాయన్నారు. ఇటీవల చనిపోయిన కోళ్ల రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. ఫౌల్ట్రీ రైతులు చేతులకు గ్లౌజులు, మాస్కులు లేకుండా కోళ్లను తాకరాదన్నారు. ఒకవేళ తాకితే సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు.



న్యూస్‌రీల్

మహిళా సంఘాలకు రుణాలు

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు



మొక్కలు నాటిన పీడీ శ్రీనివాస్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): మహిళా సంఘాల సభ్యులకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం నార్సింగి మండలం భీమ్‌రావుపల్లి గ్రామంలో మహిళ సంఘాల సభ్యులు నిర్వహించిన నామొక్క–నా బాధ్యత కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అలాగే మహిళ సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న వ్యాపారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మరిన్ని రుణాలను పొందవచ్చన్నారు. రుణాలను తీసుకుని వ్యాపారం చేయడం ద్వారా వృద్ధి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీలు సుల్తానా, శంకర్, గ్రామ కార్యదర్శి జగదీష్ ఉన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్

నర్సాపూర్: వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన రైతు వేదికలో పాల్గొన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. మొజెర్ల హార్టికల్చర్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షెహనాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేసవి సీజన్‌లో కూరగాయల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పశుసంపద, పశుజాతి అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు హితవు పలికారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ ఏడీ విజయనిర్మల, దీపిక, చంద్రవేణి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి



మాట్లాడుతున్న శశిధర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): రైతులు దరఖాస్తు చేసిన నెల రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే, విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యులు శశిధర్ రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ నియంత్రణ మండలి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ షాక్ వల్ల రైతు చనిపోతే ,ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షలను రూ.15 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి వచ్చే ఫీడర్‌పై ఉన్న మోటార్లకు మీటర్లు పెట్టవద్దని సూచించారు. విద్యుత్ పార్టుల స్టోర్‌ను మెదక్‌లో ఏర్పాటు చేయాలని కోరారు.

రూ.100 కోసం స్తంభం ఎక్కి హల్‌చల్



స్తంభంపై ఎక్కిన యువకుడు

రామాయంపేట(మెదక్): ఆటలో పోగొట్టుకున్న రూ.100 కోసం మద్యం మత్తులో ఓ యువకుడు స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికంగా కూరగాయల వ్యాపారం చేసే విఠల్ నాయక్ మంగళవారం చిత్తుబొత్తులో వంద రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తాను పోగొట్టుకున్న డబ్బులు ఇప్పించాలని అడిగాడు. మద్యం మత్తులో స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్‌ఐ బాలరాజ్ అక్కడికి వచ్చి ఎంత సముదాయించినా దిగకుండా మొండికేశాడు. ఫైర్ ఇంజన్ సిబ్బంది నిచ్చెన సహాయంతో పైకి ఎక్కి విఠల్‌ను కిందికి దించారు.

రూ.2కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

- వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా
- విద్యుత్ కోతలు లేకుండా చర్యలు
- విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

మెదక్ కలెక్టరేట్: వేసవిలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు విద్యుత్ శాఖ మెదక్ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి వెల్లడించారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ శంకర్ ఆధ్వర్యంలో వేసవి ప్రణాళికపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా ఇప్పటికే రూ.2 కోట్ల వ్యయంతో పాతూరు సబ్‌స్టేషన్‌లో కొత్తగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను (పీటీఆర్), ర్యాలమడుగు సబ్‌స్టేషన్‌లో 3.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మెదక్ పట్టణంతోపాటు మండలంలోని బాలానగర్‌లో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించామని, ముమ్ముందు ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మెదక్ విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శంకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈలు) చాంద్‌పాషా, గరుత్మంతరాజు, శ్రీనివాసరావు, ఏడీఈలు మోహన్‌బాబు, ఆయా మండలాల ఏఈలు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేసవి ప్రణాళికపై సమీక్షిస్తున్న చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

ఇంటర్ పరీక్షలకు వేళాయే

నేటి నుంచి ప్రారంభం

- ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు
- ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు
- క్యూ ఆర్ కోడ్‌తో సెంటర్ల గుర్తింపు
- మొత్తం 12,484 విద్యార్థులు



పాపన్నపేట జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): జిల్లాలో ఇంటర్ మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసారి నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ నిబంధన సడలించారు. 5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతించ నున్నారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ,12,484 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరంలో 6,066 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,418 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్ష కేంద్రంలో అమర్చిన సీసీ కెమెరాలతో ఇంటర్ బోర్డు అధికారులు డైరెక్ట్‌గా వీక్షించనున్నారు. హాల్‌టికెట్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రం లొకేషన్ తెలుసుకోవచ్చు.

భారీగా సిబ్బంది

పరీక్షల నిర్వాహణ కోసం హైపర్ కమిటీ సభ్యులు, కన్వీనర్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఒక్కొక్కరు, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు 30, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లు 30 మంది, 520 మంది ఇన్విజిలేటర్లను నియామకం చేశారు. ఒక్కో కేంద్రంలో 5 సీసీ కెమెరాలు బిగించారు. వీటి ద్వారా ఇంటర్ బోర్డు అధికారులు డైరెక్ట్‌గా సెంటర్‌లోని పరిస్థితులు వీక్షించవచ్చు. ఉదయం 9 గంల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. హాల్ టికెట్ రాని వారు నేరుగా టీజీబీఐ వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ప్రశ్న పత్రంపై సీరియల్ నంబర్ ముద్రిస్తున్నారు. ప్రశ్నాపత్రం బయటకు వెళ్తే ఎవరి పేపరో తెలుస్తుంది.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు



నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతీ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు ఎవరైనా ఒత్తిడికి, మానసిక ఆందోళనకు గురైతే వెంటనే 14418 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకెళ్లొద్దు. వాచ్‌లు కూడా తీసుకురావద్దు. విద్యార్థులకు సమయం తెలిసేలా అర గంటకోసారి బెల్ మోగిస్తారు. పరీక్షలు కట్టు దిట్టంగా నిర్వహించేందుకు పూర్తి చర్యలు తీసుకున్నాం. – జి.మాధవి, డీఐఈఓ

సాగునీటి నిర్వహణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- చివరి ఆయకట్టు వరకు ఘనాపురం నీరు



వరిగుంతంలో రైతుకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్)/చిలప్‌చెడ్(నర్సాపూర్): వేసవికాలంలో వరి పంటకు అవసరమైన నీటి నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వరిగుంతం గ్రామంలో, అలాగే..చిలప్‌చెడ్ మండల పరిధిలోని చండూర్ శివారులో ఎండిపోయిన పంటల వివరాలు అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఘనాపురం ఆనకట్ట నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం వరి పంటలకు నీటి కొరత లేదన్నారు. రైతులకు సాగునీరు సరఫరాకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని, నీటి నిర్వహణ, మోటార్లకు నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలు తీసుకొనేలా అధికారులను ఆదేశించామని తెలిపారు. అవసరం ఉన్న మేరకు మాత్రమే భూగర్భ జలాలు ఉపయోగించాలని, అందుకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కాగా, చిలప్‌చెడ్ మండలం చండూర్ శివారులో ఎండిపోయిన పంటల వివరాలు అడిగారు. సుమారు 250 ఎకరాల వరకు ఎండిపోయినట్లు ఏఓ సమాధానమిచ్చారు. ఎత్తిపోతల ప్రాజెక్టు ఎందుకు పనిచేయడం లేదని, ఏ మరమ్మతులు చేయించాలో, పూర్తి సమాచారం అందించాలని ఏఓను ఆదేశించారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆరుతడి పంటలు వేయాల్సిందని చెప్పారు. ఆయన వెంట ఏఈఓ కృష్ణవేణి ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తొద్దు

ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కొల్చారం కళాశాల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కళాశాలను తనిఖీ చేసిన ఆయన పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీశారు. నిర్దేశించిన సమయంలోగా విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. తాగునీటి వసతి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం తప్పనిసరి అన్నారు.

వేసవిలో కూరగాయల సాగు బాగు

పీజేటీఏయూ శాస్త్రవేత్తలు



రైతునేస్తం కార్యక్రమం వీక్షిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవిలో కూరగాయల సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని పీజేటీఏయూ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం) శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌడిపల్లి రైతువేదికలో అధికారులు, రైతులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు వేసవి సందర్భంగా కూరగాయలు సాగు చేయడంవల్ల మంచి లాభాలు వస్తాయని సూచించారు. కాగా నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని ఎండా వేడిమిని తట్టుకునేలా షెట్‌నెట్, నీడపందిరి పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం నాటికి దిగుబడి వస్తే డిమాండ్ బాగా ఉంటుందని మంచి లాభాలు వస్తాయన్నారు. రైతులు వ్యవసాయ అనుబంధంగా పాడిపశువులను పెంచాలని పాడి అభివృద్ధితో ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని శాస్త్రవేత్తలు సూచించినట్లు ఏఓ స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సౌజన్య, సాహితి, రైతులు పాల్గొన్నారు.

లేగదూడను చంపిన చిరుత



లేగదూడను పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ వికాస్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కుల శివారులో చిరుత పులి సంచారం మరోసారి కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతు ఎండీ.గౌస్ తన పొలం వద్ద కట్టి ఉంచిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. ఈ విషయాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్‌కు సమాచారం అందించగా.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని చిరుత పాదముద్రల ఆధారంగా గుర్తించారు. రైతులు రాత్రి వేళ ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి రమేష్ తదితరులు ఉన్నారు.

రికార్డులు పక్కా ఉండాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



మండల పరిషత్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిషత్ కార్యాలయాల్లో ఉండే రికార్డులు పక్కాగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై ఎంపీడీఓ కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

చేగుంట(తూప్రాన్): గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం చేగుంట ఎంపీడీఓ కార్యాలయంను సందర్శించారు.పాలకవర్గం లేకపోవడంతో గ్రామాల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యలను పరిష్కరించే విధంగా సంబంధిత సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, విజయ్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి జితేందర్



మెదక్ కలెక్టరేట్: రాజీ మార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8న మెదక్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారుల సౌకర్యార్థం ఈనెల ఒకటో తేదీ నుంచే లోక్ అదాలత్ బెంచీలను ఆయా న్యాయస్థానాలలోనే ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ లోక్‌అదాలత్‌లో వేగంగా కేసులు పరిష్కారం అవటమే కాకుండా ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు. కక్షిదారులు న్యాయస్థానానికి కట్టిన కోర్టు నుంచి ఫీజు తిరిగి పొందవచ్చునని వివరించారు. అలాగే.. కేసుపై అప్పీలుకు వీలులేకపోవటం వల్ల ఇదే చివరి తీర్పు అవుతుందని చెప్పారు.

బాల్యవివాహాలపై అవగాహన



ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జిల్లా జెండర్ స్పెషలిస్ట్ నాగమణి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి బాల్యవివాహాలు జరగకుండా చూడాలని జిల్లా జెండర్ స్పెషలిస్ట్ నాగమణి తెలిపారు. మంగళవారం కౌడిపల్లి పీహెచ్‌సీలో మహిళా సాధికారత, బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలపై ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలతో అనర్థాలు జరుగుతాయని, పెళ్లీడు వచ్చే వరకు పెళ్లి చేయవద్దని చెప్పారు. లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండల వైద్యాధికారి శ్రీకాంత్ మట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలనారు. ఈ కార్యక్రమంలో రమేష్ పాల్గొన్నారు.

'అష్ట'కష్టాలు

- వైద్య కళాశాల భవన నిర్మాణానికి అప్పగించని భూమి
- 20 ఎకరాలకుగానూ గుర్తించింది 12 ఎకరాలే
- ఇంకా కావాల్సింది ఎనిమిదెకరాలు
- 8 నెలల క్రితమే నిధులు మంజూరు
- కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలకు రూ.180కోట్లు
- అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే మెడికల్ కాలేజీ కొనసాగింపు



వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం గుర్తించిన స్థలం

మెదక్‌జోన్: మెతుకు సీమకు మంజూరైన వైద్య కళాశాలకు 'అష్ట'కష్టాలు చుట్టుముట్టాయి. ఈ కళాశాల భవననిర్మాణానికి ఎనిమిది నెలల క్రితమే నిధులు మంజూరైనా నిర్మించేందుకు ఇంకా స్థల సేకరణ మాత్రం పూర్తికాలేదు. ఈ వైద్య కళాశాల భవన నిర్మాణానికి 20 ఎకరాలు గుర్తించాల్సి ఉండగా ఇప్పటివకు 12 ఎకరాలు మాత్రమే అధికారులు గుర్తించగలిగారు. ఇంకా ఎనిమిదెకరాల స్థలాన్ని గుర్తించాల్సి ఉంది. దీంతో ఓ ప్రైవేటు అద్దె భవనంలోనే అరకొర వసతులతో వైద్య కళాశాలను కొనసాగిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతేడాది ఆగస్టులో నిధులు మంజూరు

గతేడాది ఆగస్టులో వైద్య కళాశాలను మంజూరు చేయడంతోపాటు హాస్టల్ భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్లను మంజూరు చేసింది. దీంతో తాత్కాలికంగా ఓ ప్రైవేటు అద్దెభవనంలో కళాశాలను నిర్వహిస్తున్నారు. అయితే వైద్య కళాశాల, హాస్టల్ భవనాలకు 20 ఎకరాల స్థలం అవసరం కాగా ప్రస్తుతం పిల్లికొటాల్ శివారులోని మాతా శిశు(ఎంసీహెచ్) ఆస్పత్రి సమీపంలో 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఇందుకోసం మరో 8 ఎకరాల స్థలాన్ని గుర్తించాల్సింది ఉంది.

టీజీఈడబ్ల్యూడీసీకి అప్పగింత

మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి రూ.130కోట్లు, హాస్టల్ భవనానికి రూ.50కోట్లతో కలిపి మొత్తం రూ.180కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణ పనులను ముందుగా ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించిన ఉన్నతాధికారులు మళ్లీ దానిని రద్దు చేస్తూ తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఈడబ్ల్యూడీసీ)కి అప్పగించారు.

మంత్రి ఆదేశిస్తే తప్పా...

మెడికల్ కాలేజీల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు ఈ నెల 3న స్థలాన్ని పరిశీలించారు. సరిపడా ల్యాండ్‌ను గుర్తించి టీజీఈడబ్ల్యూడీసీకి అప్పగిస్తే దాన్ని లేఅవుట్ చేశాక టెండర్ పిలుస్తారు. అనంతరం పనులు మొదలు పెడతారు. అయితే అధికారుల నిర్లిప్తత కారణంగా ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వారంలో అప్పగిస్తామన్నారు

వైద్య కళాశాల భవనంతో పాటు హాస్టల్ భవన నిర్మాణంకోసం 20 ఎకరాల స్థలం అవసరం ఉంది. పిల్లికొటాల్ శివారులోని ఎంసీహెచ్ ఆస్పత్రి సమీపంలో వైద్యారోగ్య ఉన్నతాధికారులు 12 ఎకరాలను మాకు అప్పగించారు. మరో 8 ఎకరాల భూమి కావాలి. వారం రోజుల్లో అప్పగిస్తాం అని చెబుతున్నారు. స్థలం అప్పగించాక టెండర్ పిలవాల్సి ఉంటుంది.

–చారీ, డీఈ, టీజీఈడబ్ల్యూడీసీ, మెదక్

క్లుప్తంగా

నిందితుడి రిమాండ్‌

నర్సాపూర్‌: పోలీసులపై చేయి చేసుకున్న ఘటనలో నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్‌ఐ లింగం తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా తమ పోలీస్‌ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు మోహన్‌, భిక్షపతి సోమవారం మండలంలోని మూసాపేట గ్రామానికి వెళ్లగా గ్రామానికి చెందిన సురేశ్‌ కానిస్టేబుళ్లను బూతులు తిట్టి చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు నిందితుడు సురేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిర్వాహకురాలితోపాటు విటుడు, మహిళ అదుపులోకి

సిద్దిపేటఅర్బన్‌: వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసి విటుడు, మహిళతోపాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్‌ మండలం ఎన్సాన్‌పల్లిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో బాలరాజు యశోధ అనే మహిళ తన ఇంటిలో కొంత కాలంగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు మంగళవారం దాడి చేయగా పాలమాకుల గ్రామానికి చెందిన విటుడు మోతే శేఖర్‌తోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,700 నగదు, మూడు సెల్‌ఫోన్స్‌, బైక్‌ స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక డంప్‌ సీజ్‌

కొండపాక(గజ్వేల్‌): అక్రమంగా ఇసుకను డంప్‌ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో రేగులపల్లి పద్మారెడ్డి వ్యవసాయ బావి కొంత కాలంగా దండుగుల కనకయ్య రహస్య ప్రదేశంలో అక్రమంగా ఇసుకను డంప్‌ చేసుకుంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు, త్రీ టౌన్‌, టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు సోదాలు చేసి 30 టన్నుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నను చంపిన తమ్ముడు

చేగుంట(తూప్రాన్‌): సొంత తమ్ముడే అన్నను చంపిన ఘటన మాసాయిపేటలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రమైన మాసాయిపేటకు చెందిన దుంపల మహేశ్‌(34), చందూ ఇద్దరు అన్నాదమ్ముళ్లు. పెళ్లి జరిగినా వారి భార్యలు గొడవపడి పుట్టింటికి వెళ్లిపోగా అన్నాదమ్ముళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం కూరగాయల కోసం వెళ్లిన చందూ మద్యం సేవించి ఆలస్యంగా ఇంటికి రాగా అన్న తిడుతూ గొడవ పడ్డాడు. దీంతో చందూ అన్న మహేశ్‌ను గొంతు నులిమి చంపేసాడు. అనంతరం ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని గ్రామస్తులను నమ్మించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చందూను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్‌

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ హత్య కేసులో గుమ్మడిదల పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను గుమ్మడిదల పోలీసులు వెల్లడించారు. మెదక్‌ జిల్లా నర్సాపూర్‌ మండలం బిక్య తండాకు చెందిన గుగులోత్‌ పూర్య (52) కొడిపల్లి మండలం కన్నారం తండా కేతావత్‌ ముని అనే మహిళను డిసెంబర్‌ 12న గుమ్మడిదల కల్లు కాంపౌండ్‌ వద్ద మాయమాటలు చెప్పి నల్లవల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అనంతరం మహిళను అత్యాచారం చేయడమే కాకుండా చున్నీతో మెడకు ఉరి వేసి దారుణంగా హత్య చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 4న సీసీ కెమెరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు జిన్నారం సీఐ నయీముద్దీన్‌ తెలిపారు. హత్య కేసును ఛేదించిన ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటేశం, సికిందర్‌, కిషోర్‌, కానిస్టేబుల్‌ సాయి వర్ధన్‌ రెడ్డిలను, జిన్నారం సీఐ నయీముద్దీన్‌ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్గి రాజుకుంటే బుగ్గేనా...!

సమస్యల నడుమ అగ్నిమాపక కేంద్రాలు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనాలు
- నీటి వసతి అంతంతే
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు
- ప్రారంభమైన వేసవి కాలం
- ప్రమాదాలు జరిగితే నివారించేది కష్టమే



వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే సిబ్బంది వెళ్లి మంటలార్పి ప్రమాద స్థాయిని తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకుగాను సరైన సిబ్బంది, నీటి వసతి అవసరం. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫైర్‌స్టేషన్‌లో సరైన వసతులు లేక ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది పూర్తి స్థాయిలో లేక ఖాళీలు దర్శనమిస్తున్నాయి. పై స్థాయి అధికారి నుంచి కింది స్థాయి వరకు సిబ్బంది లేరు. అలాగే అగ్రిమాపక కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్న భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అరకొర వసతుల నడుమే సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి వసతి అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు చర్యలు చేపట్టి అగ్నిమాపక కేంద్రాల్లో సరైన వసతులు కల్పిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాల్లో ఉన్న వసతులు, పరిస్థితులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రం

సగం మంది కూడా లేని సిబ్బంది

గజ్వేల్‌: గజ్వేల్‌లోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గంలోని గజ్వేల్‌, ములుగు, వర్గల్‌, జగదేవ్‌పూర్‌, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని ప్రజల అవసరాల కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 34 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా, కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. అత్యంత కీలకమైన ఈ కేంద్రానికి సొంత భవనం ఏళ్ల తరబడి కలగానే మిగిలింది. ప్రస్తుతం తూప్రాన్‌ రోడ్డు వైపున గల ప్రాంతీయ జీవనోపాదుల వనరుల శిక్షణ కేంద్రంలో తాత్కాలికంగా కొనసాగుతుంది. మూడు యంత్రాలు అందుబాటులో ఉన్నా.. సింగిల్‌ ఫేజ్‌ బోరు మాత్రమే ఉంది. దీని వల్ల సకాలంలోని నీటిని నింపుకొని వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. వెంటనే ఇక్కడ త్రీఫేజ్‌ మోటార్‌ బోరు బిగించాల్సి ఉంది. అంతేకాకుండా సిబ్బంది కొరత తీర్చి, సొంత భవనం ఏర్పాటు చేస్తేనే వేగవంతమైన సేవలు అందే అవకాశముంది.

సంసిద్ధమే.. బొల్లారంలో సమస్యాత్మకం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో బీహెచ్‌ఈఎల్‌, బీడీఎల్‌ పాశ మెల్గారం, పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. పాశమెలారం పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఎప్పటికప్పుడూ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పారిశ్రామిక వేత్తలు సహకారంతో అక్కడ అగ్నిమాపక శకట నిర్వహణ కొనసాగుతుంది. బీహెచ్‌ఈఎల్‌లో రెండు, పటాన్‌చెరులో రెండు, పాశమెల్గారంలో ఒకటి అగ్నిమాపక శకటాలు ఉన్నాయి. అందుకు సరిపడా సిబ్బంది ఉన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఎద్దుమెల్గారం నుంచి అగ్నిమాపక శకటాలను రప్పిస్తారు.

బొల్లారంలో ఇబ్బందికర పరిస్థితి

జిన్నారం, గుమ్మడిదల, బొల్లారంలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. పెరిగిన జనాభా, కాలనీలకు అందుబాటులో అగ్నిమాపక కేంద్రాలు కావాలి. బొల్లారంలో అగ్నిమాపక కేంద్రం కావాలని చాలా కాలంగా కోరుతున్నారు. ప్రైవేటు సంస్థల సహకారంతో ప్రమాదాలను నియంత్రిస్తున్నారు. బొల్లారంలో పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడల్లా హెట్రో పరిశ్రమ, లేదా రెడ్డి ల్యాబ్స్‌ అగ్నిమాపక సిబ్బందితో ప్రమాదాలను అదుపులోకి తీసుకొస్తున్నారు.



పటాన్‌చెరులో అగ్నిమాపక కేంద్రం

శిథిల భవనంలో అగ్నిమాపక కేంద్రం

నారాయణఖేడ్‌: శిథిల భవనంలో సరైన సదుపాయాలు లేక ఖేడ్‌ అగ్ని మాపక కేంద్రం నిర్వహణ ఇబ్బంది కరంగా మారింది. ఖేడ్‌లో 2004లో అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు శిథిలంగా ఉన్న పంచాయతీరాజ్‌ గోడౌన్‌ భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. భవనం పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. నీటి వసతి కోసం బోరు లేకపోవడంతో 5 కిలోమీటర్ల దూరంలోని కమలాపూర్‌ చెరువులోంచి నీటిని నింపుకొని ప్రమాదాల నివారణకు వెళ్తున్నారు. ఏడు మండలాలైన ఖేడ్‌, కంగ్టి, సిర్గాపూర్‌, కల్హేర్‌, నిజాంపేట, నాగల్‌గిద్ద, మనూరు ఈ అగ్నిమాపక కేంద్రం పరిధి కిందకు వస్తాయి. నూతన భవనం నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణం, బోరు, ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నారు. అప్పటివరకు ఇబ్బందులు తప్పేలా లేవు.



పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం

సమృద్ధిగా నీరు

మెదక్‌జోన్‌: మెదక్‌ జిల్లా కేంద్రంలో మూడు అగ్ని మాపక శకటాలు ఉండగా. వాటిలో ఒకటి పాడైపోయింది. దానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రెండు శకటాలను ఉపయోగిస్తున్నారు. అలాగే జిల్లా అధికారితో పాటు 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 14 మంది ఉన్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. అగ్నిమాపకశాఖ ఆవరణలోనే బోరు ఉంది. నీటి నిల్వకోసం కుండీలను నిర్మించగా నీరు సమృద్ధిగా ఉంది.

ఫైర్‌ స్టేషన్‌లో నర్సా'పూర్‌'

నర్సాపూర్‌: నర్సాపూర్‌లోని అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. రెండు ఫైరింజన్లు ఉండగా ఒకే షెడ్డు ఉండటంతో ఒక దానిని బయటే పెడుతున్నారు. ఫైర్‌ స్టేషన్‌కు ఆఫీసు భవనంతో పాటు ఇక్కడ పని చేసే సిబ్బందికి రెస్ట్‌ రూమ్‌ ఇతర వసతులకు శాశ్వత భవనం లేనందున ఫైరింజన్‌ షెడ్డు పక్కన ఉన్న చిన్న పాటి ఇరుకైన గదినే ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడానికి వినియోగిస్తున్నారు.ఫైర్‌ స్టేషన్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వారి పోస్టులతోపాటు ఒక లీడింగ్‌ ఫైర్‌మెన్‌, డ్రైవర్‌ పోస్టు ఖాళీగా ఉంది. పది మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉండగా 9 ఖాళీలున్నాయి. ఫైర్‌మెన్ల ఖాళీలు భర్తీ చేయలేని ఉన్నతాధికారులు వారి స్థానంలో 10 మంది హోంగార్డులతో విధులు చేయిస్తూ ఫైర్‌ స్టేషన్‌ను కొనసాగిస్తున్నారు.



షెడ్డులో స్థలం లేక ఎండలో ఉన్న ఫైరింజన్‌

మార్కెట్‌ యార్డులో ఫైర్‌స్టేషన్‌

దుబ్బాక: దుబ్బాకలో అగ్నిమాపక కేంద్రంకు సొంత భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్‌ యార్డులోనే ఎనిమిదేళ్లుగా కొనసాగుతుంది. మార్కెట్‌యార్డ్‌లోని రేకుల షెడ్‌ నుంచే ఫైర్‌స్టేషన్‌ నిర్వహణ చేస్తున్నారు. ఫైర్‌స్టేషన్‌ భవనం నిర్మాణం కోసం చీకోడ్‌ రోడ్‌లో స్థలం సిద్ధంగా ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో అరకొర సౌకర్యాలతోనే ఫైర్‌స్టేషన్‌ కొనసాగుతుంది. మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగినన్ని రోజులు ఫైర్‌ సిబ్బందికి చాలా ఇబ్బందిగా తయారైంది. ఫైర్‌ స్టేషన్‌లో అధునాతన టెక్నాలజీతో కూడిన 4,500 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఫైరింజన్‌ వాహనం ఉంది. ఫైరింగ్‌ స్టేషన్‌ ఆఫీసర్‌తో పాటు మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. కేవలం ఒక ఫైర్‌మెన్‌ పోస్టు ఖాళీగా ఉంది. ఫైరింజన్‌లోకి వాటర్‌ను లచ్చపేట రోడ్‌లో బోర్‌ వద్ద నింపుకోవాల్సి వస్తుంది. కొత్తగా సొంతభవనం నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి.



దుబ్బాక మార్కెట్‌ యార్డులో ఉన్న ఫైరింజన్‌

అన్ని విధాలుగా సిద్ధం



వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి దీని కోసం ముందుగానే అన్ని విధాలుగా జాగ్రత్త చర్యలతో సిద్ధంగా ఉన్నాం. సొంత భవనం లేక ఇబ్బంది తప్ప సిబ్బందితో పాటు అధునాతనమైన ఫైరింజన్‌ సౌకర్యంతోపాటు అన్ని బాగానే ఉన్నాయి.

– కమలాకర్‌, దుబ్బాక అగ్నిమాపక అధికారి

పరిధి ఎక్కువ.. ఫైర్‌ ఇంజన్లు తక్కువ

జహీరాబాద్‌ టౌన్‌: జహీరాబాద్‌ కేంద్రం పరిధిలో జహీరాబాద్‌, మొగుడంపల్లి, న్యాల్‌కల్‌, ఝరాసంగం, రాయికోడ్‌, కోహీర్‌ మండలాలు ఉన్నాయి. జహీరాబాద్‌ డివిజన్‌ పరిధి పెద్దగా ఉండడంతో తరుచుగా ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం జరుగుతుంది. ముఖ్యంగా చెరుకు తోటల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జహీరాబాద్‌ మొగుడంపల్లి, న్యాల్‌కల్‌ మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవించి పదుల ఎకరాల్లో పంట దగ్ధమైంది. అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌ ఇంజన్‌ మాత్రం ఒక్కటే ఉంది. పాత ఇంజన్‌ పాడైపోవడంతో కొత్త అగ్నిమాపక యంత్రం వచ్చింది. అ లాగే సిబ్బంది కొరత వేధిస్తుంది. పది మంది ఫైర్‌మెన్‌లు ఉండాలి కానీ ప్రస్తుతం నలుగురే ఉన్నారు. మూడు డ్రైవర్‌ పోస్టులు ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ర్‌ ఆఫీసర్‌ పోస్టుకు ఖాళీగానే ఉంది. అగ్నిమాపక కేంద్రంలోనిసేఫ్టీ పరికరాలు పాతబడడంతో వాటి స్థానంలో కొత్తవి వచ్చాయి.



జహీరాబాద్‌ అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌ ఇంజన్‌

వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ

- సిద్దిపేట ఇన్‌చార్జి ఫైర్‌ అధికారి నర్సింలు



సిద్దిపేటకమాన్‌: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సిద్దిపేట ఫైర్‌ స్టేషన్‌ ఇన్‌చార్జి అధికారి నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే సమాచారం అందించాలని ఫైర్‌ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. సిద్దిపేట ఫైర్‌ స్టేషన్‌లో ఒక మల్టీపర్పస్‌ టెండర్‌ వెహికిల్‌ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వాహనంలో 4,500 లీటర్ల నీటి సామర్థ్యం, 500 లీటర్ల ఫోమ్‌ ఉంటుందని తెలిపారు. సిద్దిపేట ఫైర్‌ స్టేషన్‌లో ఒక అధికారి, ఒక హెడ్‌ కానిస్టేబుల్‌, ఆరుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు డ్రైవర్లతో కలిపి మొత్తం 11 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది 26 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు.



సిద్దిపేట ఫైర్‌ స్టేషన్‌లో వాహనాలు

మిషన్‌ భగీరథ నీళ్లే దిక్కు

జోగిపేట(అందోల్‌): అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలోని ఫైర్‌ స్టేషన్‌లో ఇద్దరు డ్రైవర్లు, ముగ్గురు ఫైర్‌మెన్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒక్క డ్రైవర్‌ ఎస్‌ఐ ట్రైనింగ్‌కు వెళ్లాడు. ప్రస్తుతం నారాయణఖేడ్‌కు చెందిన డ్రైవర్‌ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. చాలా కాలంగా ఫైర్‌ ఇంజన్‌ పనిచేయని పరిస్థితికి రావడంతో ఇటీవల జహీరాబాద్‌లోని ఫైర్‌ ఇంజన్‌ను జోగిపేట స్టేషన్‌కు పంపారు. ఇప్పటి వరకు వాహనంను అధికారికంగా అప్పగించలేదన్నది సమాచారం. స్టేషన్‌కు అవసరమైన నీటి కోసం వేసిన బోరు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం కావడంతో దుర్గంధం వస్తుంది. వాటిని వినియోగించకుండా మున్సిపల్‌ అధికారులతో మిషన్‌ భగీరథ నల్లా కనెక్షన్‌ తీసుకున్నట్లు ఫైర్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు.



జోగిపేట ఫైర్‌ స్టేషన్‌

కేంద్రం మంజూరు.. స్థలం కరువు

తూప్రాన్‌: తూప్రాన్‌ డివిజన్‌ కేంద్రానికి అగ్నిమాపక కేంద్రాన్ని రెండేళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ అధికారులు స్థలం కేటాయింపు చేయకపోవడంతో కేంద్రం ఏర్పాటు కావడం లేదు. తూప్రాన్‌ ఉమ్మడి మండలంలో పారిశ్రామిక వాడలు అధికంగా ఉన్నాయి. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే సకాలంలో అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా రూ.కోట్లలో ఆస్తి నష్టం జరుగుతోంది. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు గజ్వేల్‌, రామాయంపేట, నర్సాపూర్‌ అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు రావాల్సిన దుస్థితి నెలకొంది. గంటలకు పైగా జాప్యం జరగడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రాన్నికి స్థలం కేటాయింపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్ల కొరత

రామాయంపేట(మెదక్‌): రామాయంపేట ఫైర్‌ స్టేషన్‌ (అవుట్‌ పోస్టు)లో సిబ్బంది కొరత నెలకొంది. మొత్తం 16 మంది సిబ్బందికి ముగ్గురిని డిప్యూటేషన్‌పై మెదక్‌ పంపించారు. ఇక్కడ కేవలం 13 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్‌ ఉద్యోగులు, 11 మంది హోంగార్డులున్నారు. ఫైర్‌ ఇంజన్‌ తోలడానికిగాను ఇద్దరు ప్రత్యేకంగా డ్రైవర్లను నియమించాల్సి ఉండగా, హోంగార్డులే బండి తోలుతున్నారు. వర్షాకాలంలో షెడ్డు ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బందులపాలవుతున్నారు.



రామాయంపేట ఫైర్‌ స్టేషన్‌

పోటీలతో ప్రతిభ పెరుగుతోంది

- మహిళా పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ భవానీ
- జిల్లాస్థాయి సాంకేతిక పోటీలు

మెదక్‌ కలెక్టరేట్‌: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతీ సంవత్సరం ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ భవానీ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాలలో సృజనా టెక్‌ఫెస్ట్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మెదక్‌, నర్సాపూర్‌, సిద్దిపేట, జహీరాబాద్‌ కళాశాలల విద్యార్థులు గ్రూపులుగా పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పోటీల్లో ఉత్తమ సాంకేతికతో ప్రాజెక్ట్‌ రూపొందించిన సిద్దిపేట పాలిటెక్నిక్‌ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ భవానీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 పాలిటెక్నిక్‌ కళాశాలలు ఉండగా సివిల్‌ సబ్జెక్ట్‌ ఉన్న కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన సిద్దిపేట విద్యార్థులకు బహుమతి అందజేసిన ప్రిన్సిపాల్‌ వారిని అభినందించారు. కార్యక్రమంలో సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగం జిల్లా కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ బీవీ సుబ్బయ్య, సృజనా టెక్‌ ఫెస్ట్‌ ప్రతినిధులు భరత్‌కుమార్‌, నరేశ్‌, మెదక్‌ పాలిటెక్నిక్‌ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్‌, భవానీ కుమార్‌, స్వరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్దిపేట కళాశాల విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

అల్లాదుర్గం(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పల్లేగడ్డ (కుసంబీనగర్‌) శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన బండ సాయిలు(55), మాణి మ్మ(50) భార్యాభర్తలు. వారంతపు సంతలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. టేక్మాల్‌ మండలం బోడ్మట్‌పల్లి సంతలో కూరగాయలు విక్రయించడానికి ఇద్దరూ లూనాపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై అల్లాదుర్గం నుంచి జోగిపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలై ప్రాణాలొదిరారు. ఘటనా స్థలాన్ని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.



సాయిలు (ఫైల్‌)



మాణేమ్మ (ఫైల్‌)

ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ

మెదక్‌జోన్‌: ఇంటర్మీడియెట్‌ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ అన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, వైద్య శిబిరం, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయాల్లో 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందని, జిరాక్స్‌ సెంటర్లను మూసి వేయించామన్నారు.

ఏడుపాయల దొంగలు అరెస్ట్‌

ఎస్పీ ఉదయ్‌ కుమార్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల్లో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్పీ ఉదయ్‌ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా ఏడుపాయల్లో జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి వడ్డె యాదయ్య, మక్కని నవీన్‌, ఉప్పు సాయికుమార్‌, అలకుంట నరేశ్‌, మక్కని పవన్‌, వడ్డె శ్రీకాంత్‌, వడ్డె నర్సింలును అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 121 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగల అరెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన సీఐ రాజశేఖర్‌ రెడ్డి, ఇంటలీ జెన్స్‌ సీఐ రాజిరెడ్డి, పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌ గౌడ్‌, ఏఎస్‌ఐ సంగన్న, గాలయ్య, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి

చిరుతకు కుక్క ఎర

బంధించడానికి బోను ఏర్పాటు

రామాయంపేట(మెదక్‌): రామాయంపేట పట్టణ శివారులో సంచరిస్తున్న చిరుతను బంధించడానికి అటవీశాఖ అధికారులు మంగళవారం బోను ఏర్పాటు చేశారు. చిరుత సంచరించే ప్రాంతంలో సర్వయకుంట సమీపంలో బోను ఏర్పాటు చేసిన అధికారులు.. ఎరగా అందులో కుక్కను ఉంచారు. సమీపంలోని చెట్లకు సీసీ కెమెరాలు అమర్చారు. రైతులు సర్వయకుంట ప్రాంతానికి వెళ్లవద్దని అధికారులు సూచించారు.



చిరుతను బంధించడానికి ఏర్పాటు చేసిన బోను